క్లుప్తంగా

విజేతలకు బహుమతులు

తిరుపతి ఎడ్యుకేషన్ : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు ఈ నెల 12న జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) ఆధ్వర్యంలో సైన్స్ ఫెస్ట్–2024 పేరున ''విశ్వం ఆవిర్భావం–అంతరిక్ష ప్రయోగాలు'' అనే అంశంపై టాలెంట్ టెస్టు నిర్వహించారు. నగరంలోని దాదాపు 10 డిగ్రీ కళాశాలల నుంచి 2,500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు జేవీవీ నగర కార్యదర్శి రఫీ ఆధ్వర్యంలో సర్టిఫికెట్లు, జ్ఞాపికలను అందజేశారు.

రూ.5 లక్షలు పరిహారం ఇవ్వాలి

తిరుపతి కల్చరల్: తిరుమలలో గుండెపోటుతో మృతి చెందిన కార్మికురాలు ఎం.నాగమణి కుటుంబానికి టీటీడీ రూ.5 లక్షలు పరిహారం ఇవ్వాలని సీఐటీయూ నేత టి.సుబ్రమణ్యం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తిరుమలలో వరాహ స్వామి గెస్ట్ హౌస్‌లో పని చేసే నాగమణి గురువారం డ్యూటీ ముగించుకుని కుటుంబ సభ్యులతో శ్రీవారి దర్శనానికి వెళుతున్న సందర్భంలో గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమన్నారు. 15 ఏళ్లుగా ఎఫ్‌ఎంఎస్ కాంట్రాక్ట్ కార్మికురాలుగా విధులు నిర్వహిస్తూ శ్రీవారికి సేవలు అందించారని తెలిపారు. టీటీడీ యాజమాన్యం మానవతా దృక్పథంతో ఆమె కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

విద్యాసామగ్రి వితరణ

రామచంద్రాపురం: మండలంలోని సొరకాయల పాలెం ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గ్రోమోర్ సంస్థ ప్రతినిధులు విద్యాసామగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బ్యాగులు, నోటు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జయసుధ, కోరమాండల్ సంస్థ మేనేజర్ రమణారెడ్డి, మురళి, మధు, పంచాయతీ కార్యదర్శి సుకుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం



రామచంద్రాపురం: మండలంలోని ఎన్ఆర్ కమ్మపల్లి సమీపంలో గల శ్రీ ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో 58వ మహాభారత ఉత్సవాలు గురువారం ధ్వజారోహణంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయంలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఉత్సవ మూర్తులకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భాగవతారిణి సీతాలక్ష్మి వ్యాసజననం, హరికథాగానం ఆలపించారు. ఆలయ ధర్మకర్త రమేష్ బాబు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

మఠం భూములను రక్షించండి


మంత్రికి ప్రసాదం అందిస్తున్న ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు

తిరుపతి తుడా: తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం సమీపంలో నిర్మిస్తున్న హథీరాం బావాజీ ఆలయ నిర్మాణ వ్యవస్థాపక ధర్మకర్త బి.శివనాయక్‌తో కూడిన సభ్యులు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డిని తిరుపతిలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ నిర్మాణానికి సంబంధించిన ప్లాన్ కాపీని, ప్రస్తుత నిర్మాణ దశను మంత్రికి వివరించారు. ఆలయ నిర్మాణాన్ని సందర్శించాలని కోరారు. హథీరాం బావాజీ మఠానికి సంబంధించిన భూములు పరిరక్షణకు చొరవ తీసుకోవాలని వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేశారు.

ప్రపంచ దేశాలకు మార్గదర్శి భారత్




కోర్టు సముదాయంలో..





133 అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, జెండా వందనం చేస్తున్న టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో..

- ఎందరో త్యాగధనుల పోరాటమే మన స్వాతంత్ర్యం
- వాడవాడలా అట్టహాసంగా 78వ స్వాతంత్ర్య వేడుకలు
- రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

తిరుపతి సిటీ: స్వాతంత్ర్య సమరయోధుల ఆశయ సాధనే లక్ష్యంగా కృషి చేయాలని వీసీ డాక్టర్ సీహెచ్ అప్పారావు పిలుపునిచ్చారు. గురువారం ఎస్వీయూ ఎన్టీఆర్ స్టేడియం వేదికగా వర్సిటీ అధికారులు 78వ స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ అప్పారావు జాతీయ జెండాను ఎగురవేశారు. ప్రపంచ దేశాలకు భారత్ మార్గదర్శిగా ఉండడం గర్వకారణమన్నారు. ఎస్వీయూ బోధన, పరిశోధన రంగాలలో ఎంతో ప్రగతిని సాధించిందన్నారు.

మహిళా వర్సిటీలో..

మహిళావ వర్సిటీలో వీసీ ప్రొఫెసర్ వి.ఉమ, ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో వీసీ జేవీ రమణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

అగ్రికల్చరల్, ఆర్ఏఆర్ఎస్‌లో...

ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాలలో అసోసియేట్ డీన్ ఎంవీ రమణ, అలాగే ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్ఏఆర్ఎస్)లో ఏడీఆర్ డాక్టర్ సుమతి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

సంస్కృత, వేదిక్ వర్సిటీలలో

జాతీయ సంస్కృత వర్సిటీలో కర్ణాటక సంస్కృత వర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ కేఈ దేవనాథన్ జాతీయ జెండాను ఎగురవేశారు.

వీక్ష ది స్కూల్‌లో ..

తిరుపతి ఎడ్యుకేషన్: స్థానిక బైరాగిపట్టెడలోని వీక్ష ది స్కూల్‌లో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులతో కలిసి ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి జెండావందనం సమర్పించారు.

టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో..

తిరుపతి మంగళం : టాస్క్‌ఫోర్స్ ఎస్పీ పి.శ్రీనివాస్ ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన సేవా పతకాలను, ప్రశంసాపత్రాలను సిబ్బందికి అందజేసి, అభినందించారు.

వినియోగదారుల కమిషన్ కార్యాలయంలో..

తిరుపతి లీగల్ : తిరుపతి జిల్లా వినియోగదారుల కమిషన్ కార్యాలయంలో కమిషన్ అధ్యక్షురాలు స్నేహలత రెడ్డి జాతీయ పతాకం ఎగురవేశారు.

కోర్టు ఆవరణలో..

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో మూడవ అదనపు జిల్లా జడ్జి కోర్టు హాల్ ఎదురుగా తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి ఎం.గురునాథ్ గురువారం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అలాగే తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్ హాల్ ఎదురుగా న్యాయవాదుల సంఘ అధ్యక్షుడు గోపీచంద్ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

ప్రభుత్వ సంస్థల్లో ..

తిరుపతి అర్బన్: నగరంలోని ఆర్డీవో కార్యాలయంలో నిషాంత్‌రెడ్డి, ఆర్టీసీ జిల్లా కార్యాలయంలో డీపీటీఓ చెంగల్‌రెడ్డి జెండాను ఆవిష్కరించారు. ఆర్టీసీలో 42 మంది ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందించారు.

అంబేడ్కర్ లా కాలేజ్‌లో..

తిరుపతి సిటీ : స్థానిక అంబేడ్కర్ గ్లోబల్ న్యాయకళాశాలలో కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్.తిప్పారెడ్డి జాతీయ పతాకం ఆవిష్కరించి ప్రసంగించారు.

నగరపాలక సంస్థలో..

తిరుపతి తుడా : నగరంలోని వివిధ సంస్థల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ జెండాను ఎగురవేసి గౌరవ వందనం చేశారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో మేయర్ శిరీష, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య జాతీయ జెండాను ఆవిష్కరించి, ఉద్యోగులకు సిబ్బందికి మిఠాయిలు పంచిపెట్టారు. అలాగే స్విమ్స్ యూనివర్సిటీలో వీసీ డాక్టర్ రవికుమార్, ఎస్వీ మెడికల్ కళాశాలలో, ఈఎస్ఐ ఆస్పత్రిలోనూ అధికారులు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

విద్యాసంస్థల్లో..

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో గురువారం 78వ పంద్రాగష్టు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

వికసిత్ భారత్‌ను పునరుద్ఘాటిద్దాం

తిరుపతి కల్చరల్: మన పూర్వీకుల త్యాగాలను గౌరవిస్తూ వికసిత్ భారత్– అభివృద్ధి చెందిన సమ్మిళిత భారతదేశాన్ని నిర్మించాలనే మన నిబద్ధతను పునరుద్ఘాటిద్దామని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ రాయులు పిలుపునిచ్చారు. గాంధీ రోడ్డులోని ట్రస్ట్ కార్యాలయంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

లిటిల్ ఏంజిల్స్‌లో..

తిరుపతి కల్చరల్: యశోదనగర్‌లోని లిటిల్ ఏంజిల్స్ విద్యాసంస్థలో గురువారం 78వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అధినేత కె.రాజగోపాల్‌రెడ్డి, చైర్‌పర్సన్ ఎం.రమాదేవి పతాకాన్ని ఆవిష్కరించారు.

టీటీడీ కళాశాలల్లో

తిరుపతి సిటీ: టీటీడీ డిగ్రీ కళాశాలల్లో 78వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల ఆవరణలు గురువారం త్రివర్ణ శోభితంతో మెరిసిపోయాయి. ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వేణుగోపాల్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే పద్మావతి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ప్రిన్సిపల్ నారాయణమ్మ, ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

ఆకట్టుకున్న అశ్వ ప్రదర్శన

తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో గురువారం జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో టీటీడీ కళాశాలల ఎన్‌సీసీ విద్యార్థులు అశ్వాలతో ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

దేశ భక్తుల త్యాగఫలమే స్వాతంత్ర్యం

చంద్రగిరి(తిరుచానూరు): ఎంతో దేశ భక్తుల త్యాగ ఫలితంగానే నేడు మనం స్వేచ్ఛాయుత వాతావరణంలో స్వాతంత్ర్య వేడుకలను నిర్వహించుకుంటున్నామని రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు ఆనంద్ ప్రకాష్ అన్నారు. తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి జెండా ఆవిష్కరించారు.

మహాత్ముల త్యాగఫలమే స్వాతంత్ర్యం

చంద్రగిరి: మండల వ్యాప్తంగా త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరై జెండా వందనం చేశారు. సబ్ రిజిస్ట్రార్ మోహన్, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, చంద్రగిరి పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రూప జెండా ఎగురవేశారు.

తుమ్మలగుంటలో..

తిరుపతి రూరల్: ఆధ్యాత్మిక క్షేత్రంలో దేశ భక్తిని పెంపొందించడమే లక్ష్యంగా 133 అడుగుల ఎత్తు కలిగిన జాతీయ జెండాను చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆవిష్కరించారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట కేవీఎస్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన అతిపెద్ద జాతీయ జెండాను గ్రామ పంచాయతీ సర్పంచ్ సుబ్బరామిరెడ్డి అధ్యక్షతన గురువారం ఎగురవేశారు. కేవీయస్ వేద పాఠశాల వేద విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


మంత్రి ఆనం చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న తిరుపతి వార్డు ప్లానింగ్ సెక్రటరీ నితిన్‌కృష్ణ


దేశనాయకుల వేషధారణలో వీక్ష ది స్కూల్ విద్యార్థులు


జాతీయ పతాకం ఆవిష్కరిస్తున్న డాక్టర్ పీసీ రాయులు

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి, ఎంపీడీఓ శ్రీనివాసులు జెండా ఎగురవేసి గౌరవ వందనం సమర్పించారు. అలాగే వెరిటాస్ సైనిక్ స్కూల్లో విద్యార్థుల ప్రదర్శనలు, విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

చిన్నగొట్టిగల్లులో..

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి, అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల వద్ద జెండా వందనం చేశారు.

పాకాలలో..

పాకాల : ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి జాతీయ జెండాను ఎగుర వేశారు. పాకాలలో సుమారు 600 అడుగుల జాతీయ జెండాతో సర్పంచ్ కస్తూరి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు.

భాకరాపేటలో..

భాకరాపేట : ఎర్రావారిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీపీ రెడ్డెమ్మ, పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచులు, పాఠశాలల వద్ద ఎస్ఎంసీ చైర్మన్లు, జాతీయ జెండాను ఎగురువేశారు.


ఎన్టీఆర్ స్టేడియంలో జాతీయ పతాకం ఆవిష్కరించి గౌరవవందనం చేస్తున్న ఎస్వీయూ వీసీ డాక్టర్ అప్పారావు, మహిళా వర్సిటీలో వీసీ ఉమ ప్రసంగం, ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాలలో.., సంస్కృత వర్సిటీలో కర్రసాము.., వేదిక్ వర్సిటీలో ..

టీటీడీ పరిపాలనా భవనంలో..

తిరుపతి(అలిపిరి): తిరుపతి టీటీడీ పరిపాలనా భవనంలో స్వాతంత్ర్య వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఇక్కడి పరేడ్ మైదానంలో టీటీడీ ఈవో జె.శ్యామల రావు జాతీయ జెండాను ఎగురవేసి వందనం చేశారు. భద్రతా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా టీటీడీ భద్రతా సిబ్బంది చేసిన కవాతు ఆకట్టుకుంది. ఏవీఎస్‌ఓ సతీష్ పెరేడ్ కమాండర్‌గా వ్యవహరించారు. అనంతరం విధుల్లో ఉత్తమసేవలు అందించిన వివిధ విభాగాలకు చెందిన 36 మంది అధికారులు, 251 మంది ఉద్యోగులకు, ఎస్వీబీసీలో ఏడుగురు ఉద్యోగులకు ఐదు గ్రాముల శ్రీవారి వెండి డాలర్, ప్రశంసాపత్రం అందించారు. అలాగే ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన 19 మంది ఉద్యోగుల పిల్లలకు రూ.2,116, పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 55 మంది విద్యార్థులకు రూ.1,116 నగదు బహుమతులు అందజేశారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థినులు దేశ భక్తి గీతాలకు చక్కటి నృత్య ప్రదర్శన చేశారు.


టీటీడీ ఈవో జేఈవో చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందుకుంటున్న టీటీడీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు


అవార్డు(పదోతరగతి) అందుకుంటున్న హరిణి


హరీంద్రనాథ్, దామోదరం, శివ ప్రసాద్, రమాకాంత్‌రావు, పార్థసారథి, రాజశేఖర్, రమణమూర్తి, శ్రీనివాసులు, ముని చంగల్ రాయులు, బాలాజీ, మునిరత్నం, ధర్మయ్య, రామచంద్ర, రంజిత్ కుమార్, ప్రసాద్, కన్నన్, శ్రీనివాసులు, నాగరాజు, సావిత్రమ్మ, సుబ్రహ్మణ్యం, ఇంద్రనాథ్, షణ్ముఖ కుమార్, గోవిందరాజ దీక్షితులు, రవిచంద్ర దీక్షితులు, ప్రతాప్, రాజగోపాలం, సూర్య కుమార్, శ్రీనివాసరావు, జనార్దన్ రెడ్డి, ప్రదీప్, హరి, శీనయ్య, వీరాంజనేయులు, ముని కుమార్, రాజేష్ కుమార్, రాజేష్ యాదవ్


అవార్డు అందుకుంటున్న ఆఫీస్ సబార్డినేట్ దివాకర్

నిబంధనలు పట్టవా


నిబంధనలకు విరుద్ధంగా ఏ హోదా లేని టీడీపీ నాయకుడు జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం

తిరుపతి సిటీ: తిరుపతి బైరాగిపట్టెడలోని ఎంజీఎం హైస్కూల్‌లో జెండా ఆవిష్కరణ వివాదంగా మారింది. ఇక్కడ జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఊహించని రీతిలో టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ హాజరయ్యారు. అనంతరం ఆయన జాతీయ జెండా ఎగురవేసి వందనం సమర్పించారు. వాస్తవానికి జాతీయ జెండాను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్, ఎంఈఓ, జిల్లా అధికారులకు మాత్రమే ఎగురవేసే అధికారం ఉంది. కానీ ఏ హోదాలేని టీడీపీ నాయకుడి చేత జెండా ఆవిష్కరించడం వివాదాలకు దారితీస్తోంది.

అవగాహనతో శ్వాసకోస వ్యాధుల నివారణ


మాట్లాడుతున్న డాక్టర్ సుబ్బారావు

తిరుపతి కల్చరల్: అవగాహన కలిగి ప్రాథమిక స్థానలోనే చికిత్స చేసుకోవడం ద్వారా శ్వాసకోస వ్యాధులను నివారించే అవకాశం ఉందని ప్రముఖ డాక్టర్ ఎస్.సుబ్బారావు తెలిపారు. డీబీఆర్ రోడ్డులోని ఎస్వీ అలెర్జీ అండ్ చెస్ట్ హాస్పిటల్‌లో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు పీఏఫ్‌టీ, ఎక్స్‌రే, ఈసీజీ, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

భక్తులకు మధురానుభూతిని కలిగించడమే లక్ష్యం


జెండా వందనం చేస్తున్న అదనపు ఈఓ వెంకయ్య

తిరుమల: భారతదేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చేందుకు జాతీయ నాయకులు అకుంఠిత దీక్షతో ఎన్నో త్యాగాలు చేశారని, అలాంటి వారిని టీటీడీ ఉద్యోగులు స్ఫూర్తిగా తీసుకుని భక్తులకు మెరుగైన సేవలు అందించి, తిరుమల యాత్ర భక్తుల మనసులో మధురానుభూతిని మిగిల్చే విధంగా విధులు నిర్వహించాలని అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్య చౌదరి అన్నారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ రోజుకు దాదాపు 85 వేల మంది భక్తులకు ఇబ్బంది లేకుండా దర్శనం కల్పిస్తున్నామని, టీటీడీ ఉద్యోగులు నాణ్యమైన అన్నప్రసాదాలు అందించడంతోపాటు, క్యూ లైన్లు, ఇతర ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచడంలో 24 గంటల పాటు ఉత్తమ సేవలందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ–2 సత్యనారాయణ, డిప్యూటీ ఈఓలు భాస్కర్, వెంకటయ్య, ఆశా జ్యోతి, వీజీఓలు సురేంద్ర, రామ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ వైర్ల చోరీ

రామచంద్రాపురం: మండలంలోని కుప్పంబాదూరు గ్రామంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ మోటార్ వైర్లు చోరీ చేసిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలోని దాదాపు 20 మంది రైతుల వ్యవసాయ పొలాల వద్ద స్టార్టర్ల నుంచి మోటార్ల వరకు అమర్చిన రాగి వైర్లను చోరీ చేశారు. గ్రామస్తులు దీనిపై పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

శాస్త్రోక్తంగా ధ్వజస్తంభ ప్రతిష్ట


పూజల్లో పాల్గొన్న ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రాలు, మంగళ వాయిద్యాలు, ఋత్వికుల ప్రత్యేక పూజలు నడుమ ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. పూజల్లో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.సుబ్బరామిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

దుప్పట్లు, ట్రై సైకిళ్ల పంపిణీ

తిరుపతి కల్చరల్: రాస్ ఆధ్వర్యంలో గురువారం నిరుపేదలకు చేతి కర్రలు, దుప్పట్లు, మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ చేశారు. దీనికి ముందు రాస్ మహిళా పొదుపు సంఘాల ఆధ్వర్యంలో దాసరి మఠంలో 78వ స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ డీఎం శరవణ, రాస్ మహిళా పొదుపు సంఘాల ప్రాజెక్టు డైరెక్టర్ వి.నాగరాజుతో కలిసి జెండా ఎగురవేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

తిరుపతి క్రైమ్: అనుమానాస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. అలిపిరి ఎస్ఐ రాజశేఖర్ తెలిపిన వివరాలు.. రేణిగుంట పాంచాలి నగర్‌కు చెందిన పైనేటి వెంకటాద్రి(48), నాగమణి 2001లో వివాహం చేసుకున్నారు. టైలర్ వృత్తి చేసుకునే ఇతనికి కృష్ణారెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న ధనలక్ష్మితో వివాహేతర సంబంధం ఏర్పడింది. గత ఆర్నెళ్లుగా ఇతను ధనలక్ష్మితోనే ఉంటున్నాడు. గురువారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఇతను అకస్మాత్తుగా మృతి చెందినట్లు అతని కుమారుడు తేజకు ధనలక్ష్మి ఫోన్ చేసి చెప్పింది. దీనిపై వారు అనుమానం వ్యక్తం చేస్తూ అలిపిరి స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.